సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



బాల శాస్త్రవేత్తలు

ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికయ్యారు.

వివరాలు 8లో ▸



రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఉత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /18.5

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత ఉండే అవకాశం ఉంది. ఎండ ప్రభావం చూపిస్తుంది.

న్యూస్‌రీల్

ర్యాగింగ్‌ను అరికట్టాలి



కందనూలు: రాష్ట్రంలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, ఉన్నత విద్యా కళాశాలల్లో ర్యాగింగ్ భూతం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివశంకర్‌గౌడ్ అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లాకేంద్రం శివారులోని మెడికల్ కళాశాలను బంద్ చేయడంతోపాటు కళాశాలలో ర్యాగింగ్‌ను అరికట్టాలని కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ విద్యార్థి ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, ర్యాగింగ్‌కు పాల్పడిన సైకో విద్యార్థి సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ర్యాగింగ్ భూతాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కార్తిక్, నాయకులు శ్రావణ్, సతీష్, రమేష్, చరణ్, సాయికృష్ణ, శరత్, విజయ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను అడ్డుకుంటున్న కేసీఆర్



కోడేరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను సీఎం కేసీఆర్ అడ్డుకుంటున్నారని బీసీ జాతీయ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. సోమవారం మండలంలోని కొండ్రావ్‌పల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాగోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎం నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఆస్పత్రులు అధ్వానంగా మారాయని విమర్శించారు. వైద్యులు ఉంటే మందులు ఉండవు.. మందులు ఉంటే వైద్యులు ఉండరని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి జైజై.. కేసీఆర్‌కు బైబై చెప్పేందుకు రాష్ట్ర ప్రజలు నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో..

- కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి కృషి
- కుక్కలు, కోతులు, వందుల బెడద నివారణకు కఠిన చర్యలు
- ట్రాఫిక్ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు
- కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన



సాక్షి ఫోన్ ఇన్

మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ కట్టే పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పట్టణాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు వీలవుతుందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ అన్నారు. పట్టణ ప్రజలే కాకుండా.. సిబ్బంది, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో పట్టణ అభివృద్ధిలో మరింత పురోగతి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. సోమవారం సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పట్టణ ప్రజలు వారి సమస్యలు, ఇతర అంశాలను ఫోన్ ద్వారా కమిషనర్‌ను అడగగా వాటికి ఆయన సమాధానం ఇవ్వడంతోపాటు వెంటనే పరిష్కరించేందుకు సిబ్బందికి సూచనలు చేశారు. – కల్వకుర్తి టౌన్

ప్రశ్న: మిషన్ భగీరథ ఇంట్రా పైప్‌లైన్, కనెక్షన్లు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు.
– అబ్దుల్ కరీం, రిటైర్డు ఉపాధ్యాయుడు

కమిషనర్: పట్టణంలో చాలా వరకు కాలనీల్లో ఇంట్రా పైప్‌లైన్ పూర్తయ్యింది. మిగతా వాటిని సైతం నెలరోజుల వ్యవధిలో పూర్తిచేసి కనెక్షన్లు ఇచ్చి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ప్రశ్న: పట్టణంలోని డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన కోనోకార్పస్ చెట్లను తొలగించాలి. – శివకుమార్, గాంధీనగర్

కమిషనర్: డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన కోనోకార్పస్ చెట్ల వలన ప్రజారోగ్యానికి భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తించాం. వాటిని తొలగించేందుకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. వారి నుంచి ఆదేశాలు రాగానే తొలగించి కొత్త రకం పూల మొక్కలు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: మాంసం వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారబోస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం.
– రాజేష్, విద్యానగర్

కమిషనర్: పట్టణంలోని మాంసం దుకాణాల వారు వ్యర్థాలను ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి వేరేచోటుకు తరలిస్తున్నారు. కొన్ని దుకాణాల వారు వ్యర్థాలను ఊరిబయట బహిరంగంగా పారేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే అన్ని మాంసం దుకాణాలకు చివరి నోటీసులను అందజేశాం. ఇకపై ఎవరైనా ఇష్టానుసారంగా పారేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వీధిదీపాలు రాత్రి సమయంలో వెలగడం లేదు.
– సందీప్, పట్టణవాసి

కమిషనర్: ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వీధిదీపాల నిర్వహణ నేషనల్ హైవే పరిధిలో ఉంది. అందుకు సంబంధించిన ఏజెన్సీ వారు విద్యుత్ శాఖకు బిల్లులు సకాలంలో చెల్లించడం లేదు. త్వరలోనే సంబంధిత అధికారులతో చర్చలు జరిపి మరోమారు ఇలాంటి సమస్య రానివ్వకుండా చూస్తాం.

ప్రశ్న: మార్గదర్శి కాలనీలో తాగునీరు వృథాగా పోవడంతోపాటు డ్రెయినేజీ లేకపోవడంతో మురుగంతా రోడ్లపై పారుతోంది.
– ఆంజనేయులు, కాలనీవాసి

కమిషనర్: వెంటనే కాలనీకి మా సిబ్బందిని పంపించి లీకేజీలు సరి చేయిస్తాం. అలాగే డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభంలో ఉన్నాయి. త్వరలోనే వాటిని పూర్తిచేసి రోడ్లపై మురుగు పారకుండా చర్యలు చేపడతాం.

ప్రశ్న: కాలనీలో చెట్లు ఏపుగా పెరగడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. నల్లా కనెక్షన్లు త్వరగా ఇప్పించాలి.
– రాజేంద్రకుమార్, రామచంద్ర రెసిడెన్సీ

కమిషనర్: హైదరాబాద్ రోడ్డుకు ఉన్న రామచంద్ర రెసిడెన్సీలో చెట్లను సిబ్బందిచే తొలగిస్తాం. మిషన్ భగీరథ ఇంట్రా పైప్‌లైన్ కనెక్షన్లకు నల్లాలు బిగించి తాగునీరు అందేలా చూస్తాం.

ప్రశ్న: 6, 7 వార్డుల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. – శ్రీను, కౌన్సిలర్

కమిషనర్: ఒక్కోవార్డుకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి నిత్యం పర్యవేక్షిస్తున్నాం. త్వరలోనే రోజువారి పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నాం.

ప్రశ్న: వాసవీనగర్‌కాలనీలోని ఖాళీ స్థలాల్లో కొందరు యువకులు వికృత చేష్టలకు పాల్పడుతున్నారు. – ప్రవీణ్, వాసవీనగర్‌కాలనీ

కమిషనర్: ఖాళీ ప్రాంతానికి సంబంధించిన సమాచారాన్ని నోట్ చేసుకున్నా. స్థలం యజమానితో మాట్లాడి అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించడంతో పాటు పోలీసులకు సమాచారం ఇస్తాం.

ప్రశ్న: బస్టాండ్ సమీపంలో పూలు, పండ్ల వ్యాపారులతో ప్రజలకు, వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – శేఖర్, పట్టణవాసి

కమిషనర్: పూలు, పండ్ల వ్యాపారులు వారి నిర్దేశిత స్థలం కన్నా ముందుకు వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారనే విషయమై ఇప్పటికే వారిని హెచ్చరించి నోటీసులు జారీచేశాం. వారంలోగా వాటిని అక్కడి నుంచి తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఆదేశాలిచ్చాం. వారు తొలగించకపోతే మున్సిపాలిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పట్టణంలో అనధికారిక కట్టడాలు ఎక్కువైన వాటిని పట్టించుకోవడం లేదు.
– రాజు, పట్టణవాసి

కమిషనర్: అనధికారిక అక్రమ కట్టడాలపై ఇప్పటికే పలువురు యజమానులకు నోటీసులు ఇచ్చాం. మిగతా వాటికి సంబంధించి డీటీఎఫ్ టీం ద్వారా పంచనామా నిర్వహించి.. వాటికి జరిమానా విధించాలా.. లేక కూల్చివేయాలనే అనేది నిర్ణయిస్తాం.

ప్రశ్న: శ్మశాన వాటికలో చెట్లు ఏపుగా పెరగడంతోపాటు అక్కడ నీరు వంటి కనీస సౌకర్యాలు లేవు.
– ప్రసాద్, విద్యానగర్

కమిషనర్: శ్మశాన వాటికలో ఉన్న చెట్లను తొలగించి దహన సంస్కారాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఇప్పటికే సిబ్బంది సూచించాం. నీటి వసతి, లైట్లు, తదితర వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పండ్లు, కొబ్బరిబోండాలు డ్రెయినేజీల్లో వేస్తున్నారు. దీంతో మురుగు పారక దుర్వాసన వస్తోంది.
– శ్రీను, హనుమాన్‌నగర్

కమిషనర్: కుళ్లిన కూరగాయలు, తాగేసిన కొబ్బరిబోండాలు తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా ట్రాక్టర్ ఏర్పాటు చేసినా దుకాణదారులు వాటిని వినియోగించడం లేదు. వారందరిని మరోమారు హెచ్చరించి అక్కడ పారబోస్తే వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ప్రస్తుతం మా సిబ్బంది అక్కడికి వెళ్లి మురుగు పారేలా చర్యలు చేపడుతున్నారు.

ప్రశ్న: సర్వే నం.99లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుంది.
– గాంధీ, ఎస్‌జీటీకాలనీ

కమిషనర్: ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఇప్పటికే రెవెన్యూ కార్యాలయానికి వినతి పత్రం అందజేశాం. వారి నుంచి అనుమతి రాగానే పట్టణంలోని అన్ని ప్రభుత్వ స్థలాలను గుర్తించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కబ్జాకు గురవకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కుక్కలు, కోతుల బెడద కారణంగా బయటకు రావాలంటే భయంగా ఉంది.
– ఇస్మాయిల్, గాంధీనగర్

కమిషనర్: కుక్కలు, కోతుల బెడద ఎక్కుగా ఉందని గుర్తించి నాలుగు రోజుల క్రితమే వెటర్నరీ, మున్సిపాలిటీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశాం. మహిళా సంఘాల సభ్యులు, ఆర్పీలను కలిసి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం. వీరి ద్వారా సంతానోత్పత్తి జరగకుండా, యాంటీ రాబిస్ సూదులు వేయించేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

ప్రశ్న: గాంధీనగర్ కాలనీలో కొన్నిచోట్ల మిషన్ భగీరథ నీరు రాక, పాత పైప్‌లైన్ లేక తాగునీటి కొరత ఏర్పడుతుంది.
– బాబీ, గాంధీనగర్

కమిషనర్: మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు విషయంలో కాలనీవాసుల సహకారం లేక కొంత ఆలస్యమైంది. ప్రతిరోజు నీరు రాకపోవడానికి పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల వల్ల పైప్‌లైన్ పగిలిపోయింది. త్వరలోనే వాటిని పూర్తిచేసి నీటిని పునరుద్ధరిస్తాం.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో పలు సమస్యలపై 52 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ధరణిలో నమోదు చేసుకున్న సమస్యల పరిష్కారం కోసం వచ్చిన 60 దరఖాస్తులను కలెక్టర్ అప్పటికప్పుడే పరిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్ 5..

నాగర్‌కర్నూల్ క్రైం: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజావాణికి 5 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో ఒకటి భూసంబంధిత, రెండు దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, రెండు ఇరువర్గాల మధ్య గొడవలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు.

వేరుశనగ @ రూ.7,900



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగ క్వింటాల్‌కు అత్యధికంగా రూ.7,900, మధ్యస్తంగా రూ.7,411, అత్యల్పంగా రూ.6,721 ధర లభించింది. ఆదివారం కన్నా రూ.160 తగ్గింది. 98 మంది రైతులు 3,771 బస్తాల వేరుశనగను మార్కెట్‌కు తీసుకువచ్చారు.

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ హైరానా
- సొంత అనుచరగణంపైనే లీడర్ల ఫైర్
- బీఆర్‌ఎస్‌లో పెరుగుతున్న అసమ్మతి రాగం
- పలు నియోజకవర్గాల్లో మారుతున్న రాజ'కీ'యం

● 'మాట'లు.. మంటలు


'అధికార'నేతల్లో అసహనం..!

ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీ భారత రాష్ట్ర సమితికి చెందిన ముఖ్య నేతలు సొంత అనుచరగణంపై పలు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయాన్ని సాధించాలనే లక్ష్యంతో పార్టీ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తుండగా.. లీడర్లు మాత్రం సొంత కేడర్‌పై మాటల తూటాలు ప్రయోగిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళవారిలో అసహనం పెరుగుతోందనడానికి ఇలాంటి వ్యాఖ్యలు ఉదాహరణగా నిలుస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎప్పుడూ వ్యవహరించని విధంగా నేతలు ఫైర్ అవుతుండడంతో ప్రధాన, ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య అగాధం ఇటీవల మరింత పెరిగినట్లు తెలుస్తోంది. అసమ్మతి రాగం ఊపందుకున్న క్రమంలో పలు నియోజకవర్గాల్లో మారుతున్న రాజ'కీ'యంపై పార్టీ శ్రేణుల్లో గుబులు నెలకొంది.
– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

'పళ్లెంలో పరమాన్నం ఇస్తే తినక పాచిపోయిన అన్నం అనుకుని దూరంగా జరుగుతున్నడు.. అతడి కర్మ... ఇలాంటి అసంతృప్తి వాదులు వెయ్యి మంది దూరమైనా నా గెలుపును ఎవరూ ఆపలేరు.'
– యువకులు ముద్దుగా పిలుచుకుంటున్న 'వాటర్' అంకుల్

■ పిల్లలు, యువకులు ఆత్మీయంగా వాటర్ అంకుల్‌గా పిలిచే సెగ్మెంట్‌లోని ఓ 'పెద్ద' మండలంలో చోటుచేసుకున్న ఘటనపై పార్టీశ్రేణులు భగ్గుమంటున్నాయి. ఓ టీవీలో వచ్చిన కథనాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు పోలీసులు అధికార పార్టీకి చెందిన వార్డు మెంబర్‌పై చర్యలు తీసుకున్నారు. దీని వెనుక ఆ ముఖ్యనేత ఉన్నట్లు స్థానికులు మండిపడుతున్నారు.

'మీ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయండి.. మీలో ఎవరెవరు ఏ రోజు ఏం చేస్తున్నారు.. ఎక్కడెక్కడికి మోసుకెళ్తున్నారో నాకు తెలుసు. అన్నీ జాగ్రత్తగా గమనిస్తున్నా.. మీ ఆటలు సాగవు.. సాగనివ్వను.. ఏం చేయాలో నాకు బాగా తెలుసు.. ఎవరినీ వదిలిపెట్టను.'



■ నేషనల్ హైవే-44ను ఆనుకుని ఉన్న నియోజకవర్గ పరిధిలోని ఓ ముఖ్య నేత.

పోటీదారులు ఎక్కువ కావడంతో..

బీఆర్‌ఎస్‌లో గతంతో పోలిస్తే పలు నియోజకవర్గాల్లో అత్యధికంగా పోటీదారులున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ రహదారి వెళ్తున్న ఓ నియోజకవర్గంలో ఈసారి మార్పులు ఉంటాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రస్తుత నేత ఎంపీగా వెళ్తారని.. ఆయన స్థానంలో అదే ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్త ఎమ్మెల్యేగాబరిలో ఉంటారనే ఊహాగానాలు విన్పిస్తున్నాయి. ఈ క్రమంలో పార్టీకి చెందిన పలువురు పారిశ్రామికవేత్తను తరచుగా కలుస్తుండడం అగ్గిరాజేసినట్లు తెలుస్తోంది.

'అసమ్మతి ఉంది.. నేను ఓడిపోతానని ప్రచారం చేస్తున్నారు. పక్కాగా నేనే గెలుస్తా. మీ వేషాలు చూస్తూ ఊరుకోను. పోతే అటే పోండి.. ఉంటే ఇటే ఉండండి. ఎవరైనా నాకే సపోర్ట్ చేయాలి. నన్ను ఓడించే వారు ఇక్కడ లేరు. 30ఏళ్లు నేనే అధికారంలో ఉంటా.'
– నల్లమల అటవీ ప్రాంతంలోని ఓ నియోజకవర్గ ముఖ్య నాయకుడు

■ నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఓ నియోజకవర్గ ముఖ్య నాయకుడు ఇటీవల మరింత దుందుడుకుగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సొంతపార్టీకి చెందిన మరో ముఖ్య ప్రజాప్రతినిధి, ఆయన కొడుకు పేరు చెబితేనే మండిపడుతున్న ఆయన.. సదరు వర్గ నేతలే టార్గెట్‌గా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. సదరు నేతకు మద్దతు ఇస్తున్నట్లు భావిస్తూ ఓ అధికారిపై ఇటీవల చిందులు కూడా వేశాడు. జాతరలో అందరి ముందు 'ఏడికచ్చినవ్.. కనిపిచ్చినవా నాకు ? డిమాండ్ ఎక్కువుంది నీకు.. నేనేంటో చూపిస్తా. వారం, పది రోజుల్లో నీ అంతుచూస్తా' అని ఆ ఉద్యోగిపై కస్సుబుస్సు లాడడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

'నేను లేకుండా రాజకీయాలు చేయలేరు. టికెట్ నాకు రాదనేది ప్రచారం మాత్రమే. నా వర్గం నాకుంది. గెలిచేది నేనే. నేను గెలిచినప్పుడు చూపిస్తా. ఇప్పుడు కూడా నన్ను కాదని పనులు చేసుకోండి. ఎట్ల చేస్తారో నేనూ చూస్తా.' – రాష్ట్ర సరిహద్దులోని జిల్లాకు చెందిన ఓ నియోజకవర్గ లీడర్

■ రెండు రాష్ట్రాల సరిహద్దులోని జిల్లాకు చెందిన ఓ నియోజకవర్గంపై ప్రస్తుత లీడర్‌కు మంచి పట్టు ఉంది. ఈసారి కూడా టికెట్ తనకే వస్తుందనే ధీమా ఉన్నప్పటికీ.. జిల్లాస్థాయి ముఖ్య ప్రజాప్రతినిధి ఒకరు ఆ సీటును ఆశిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా మరొకరు కూడా ప్రయత్నిస్తున్నారు. దీంతో పాటు ఇక్కడ బీజేపీ నుంచి గట్టిపోటీ ఉంది. ఈ క్రమంలో పోటీ నువ్వా..నేనా అన్నట్లు ఉండడం, సొంత పార్టీలోని కొందరు తనకు నచ్చని వారితో కలిసి ఉండడాన్ని ముఖ్యనేత జీర్ణించుకోలేక అసహనానికి గురవుతున్నట్లు సమాచారం.

'ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేదు. నా నియోజకవర్గానికి సంబంధించి రెండు ముఖ్యపదవులు ఇప్పించా. అయినా నన్ను ఇరకాటంలో పెట్టే ప్రయత్నాలు చేస్తున్నరు. నేను చూస్తూ కూర్చోను.. నాకు తెలియకుండా ఏం చేసినా తీవ్ర పరిణామాలు తప్పవు.'
– కృష్ణానది చెంతన ఉన్న నియోజకవర్గ నాయకుడు

■ కృష్ణానది చెంతన ఉన్న నియోజకవర్గంలో ముఖ్యనేతతో పాటు ఓ చైర్మన్ హోదాలో ఉన్న నాయకుడు, సెగ్మెంట్‌లోని అన్ని మండలాలు, గ్రామాల్లో సేవా కార్యక్రమాలతో దూసుకెళ్తున్న మరో నాయకుడు టికెట్ రేసులో ఉన్నారు. ఎప్పటినుంచో వీరి మధ్య గ్యాప్ ఉండగా.. ఇటీవల పలు చోట్ల ఆయా వర్గాల మధ్య దూషణలు చోటుచేసుకున్నాయి. దీంతో ముఖ్యనేతలో అసహనం పెరిగి.. వారితో ఉంటున్న వారిపై అగ్గిమీద గుగ్గిలమైనట్లు తెలిసింది.

■ ఎన్నికలకు దాదాపు 9నెలలే ఉండగా.. ఇలా పలు నియోజకవర్గాల్లో అధికార నేతలు అనుసరిస్తున్న వ్యవహార వ్యవహారశైలి చేటు చేసేలా ఉందని శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

డిమాండ్లు నెరవేర్చాలని విద్యుత్ ఉద్యోగుల ధర్నా

మన్ననూర్: తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ ఆర్టిజన్ల పర్సనల్ పే బేసిక్ పేలో కలపాలని, అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీ తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులకు సంబంధించిన 2022 పీఆర్సీ తదితర ఉద్యోగుల సౌకర్యాలను అమలు చేయకపోగా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని, హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వరకు చేరుకుని మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం, ఈగలపెంట వద్ద విద్యుత్ అధికారి ప్రధాన కార్యాలయం వద్ద సైతం నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. ఆయా కార్యక్రమాల్లో జేఏసీ నాయకులు అనిల్‌కుమార్, సునీల్, యాద య్య, చరణ్, లవకుమార్, శివశంకర్‌రెడ్డి, అశోక్, రె డ్యానాయక్, వంశీకృష్ణ, పాండు, బిక్కులాల్ పాల్గొన్నారు.



శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు



క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


నర్సింహులు(ఫైల్)

కోయిల్‌కొండ: మండలంలోని అనంతపూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతిచెందారు. ఈ సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు కుర్వ నర్సిం(38) తన పంటకు నీళ్లు పారించేందుకు వెళ్లాడు. పొలం వద్ద బోరుమోటారు ఆన్‌చేస్తుండగా విద్యుత్ స్థంబానికి గల కరెంట్ వైరు తెగి స్టాటర్‌డబ్బాపై పడి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. భర్త ఇంటికి రాకపోవడంతో భార్య కుర్వలక్ష్మి పొలానికి వెళ్లి చూడగా మృతి కనిపించాడు. చుట్టుపక్కల వారికి సమాచారం అందించి, విద్యుత్ వైరును తొలగించి భర్త మృతదేహాన్ని బయటికి తీసినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనయ్య తెలిపారు.

చెట్టుకు ఢీ కొని ఒకరు..

మక్తల్: చెట్టుకు ఢీ కొని ఒకరి మృతి చెందిన ఘటనలో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం చందపూర్ గ్రామానికి చెందిన భగవంతు(30) ద్విచక్ర వాహనంపై గుడేబల్లూరులోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. పని ముగించుకొని సోమవారం తిరుగుపయనం అయ్యాడు. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు చెట్టును ఢీ కొన్నాడు. ప్రమాదంలో భగవంతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


శివకుమార్

వనపర్తి క్రైం: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలోని పెద్దగూడెంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోయ శివకుమార్(24) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తల్లి కుమారుడి అచేతనస్థితిని చూసి లబోదిబోమన్నది. గమనించిన చుట్టుపక్కల వారు శివకుమార్‌ను కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

పోలీసుల నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు



శాంతినగర్: పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐలతో తన ప్రాణానికి ముప్పు ఉందని ఎస్పీ సృజనకు సోమవారం బాధితుడు ఎస్‌కే జహంగీర్ బాషా ఫిర్యాదు చేశాడు. 2017లో శాంతినగర్ ఎస్ఐగా మహేందర్ పనిచేస్తున్న సమయంలో ఓ సంఘటన విషయంలో తనను అసభ్య పదజాలంతోదూషిస్తూ బూటుకాలితో తన్నాడని వివరించాడు. ఈ విషయమై ఎస్ఐపై జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ అలంపూర్ కోర్టులో కేసు వేశానన్నారు. ఎస్ఐపై క్రిమినల్ కేసు నమోదు కావడంతో మహబూబ్‌నగర్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారని గుర్తు చేశారు. పలుకబడితో తిరిగి అలంపూర్ ఎస్ఐగా వచ్చారని పేర్కొన్నాడు. న్యాయం కోసం అలంపూర్ కోర్టుకు వెళ్తుండగా కానిస్టేబుల్ వెంకప్ప, న్యాయవాదుల ద్వారా ఎస్ఐ బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోయాడు. ఈ నెల 23 కానిస్టేబుల్ కేసు వెనక్కి తీసుకోవాలని లేకపోతే నీ అంతుచూస్తానని బెదిరించాడని ఎస్పీ ఎదుట మొరపెట్టుకున్నాడు. ఎస్ఐ, కానిస్టేబుల్ నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఎస్పీని కోరాడు.

బాల శాస్త్రవేత్తలు

చిట్టిబుర్రలతో అద్భుతాల సృష్టి
- వినూత్న ఆలోచనలతో సరికొత్త పరికరాల రూపకల్పన
- జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభపాటవాలు
- జాతీయ విజ్ఞాన ప్రదర్శనకు ఉమ్మడి జిల్లా విద్యార్థిని, విద్యార్థులు

నేడు జాతీయ సైన్స్ డే



వారంతా చిన్నారి విద్యార్థులు. కానీ, వారి బుర్రలు మాత్రం అపర మేధావులుగా ఆలోచిస్తాయి. అలా ఆ చిట్టిబుర్రలలో తట్టిన వినూత్న ఆలోచనలతో.. సరికొత్త పరికరాలకు రూపకల్పన చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. ఇలా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లలో ప్రతిభాపాటవాలు చాటి.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో బాలమేధావులు సృష్టించిన అద్భుత పరికరాలు, వాటి పనితీరుపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

పేదల కోసం పెల్టియర్ బ్లాంకెట్..


పెల్టియర్ బ్లాంకెట్‌ను ప్రదర్శిస్తున్న భవాని

ఉప్పునుంతల: వాతావరణ పరిస్థితులను తట్టుకోవడానికి ఇళ్లలో ఎయిర్ కండీషనర్ (ఏసీ) అమర్చుకునే స్థోమతలేని పేదల కోసం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని భవాని తన మేధాశక్తిని ఉపయోగించి కొద్దిపాటి ఖర్చుతో కప్పుకునే బ్లాంకెట్‌కే చిన్న పరికరాన్ని అమర్చి వేడి వాతావరణంలో చల్లగా, చలి కాలంలో వేడిగా ఉండేలా పెల్టియర్ బ్లాంకెట్‌ను రూపొందించింది. గైడ్ టీచర్ సతీష్ సహకారంతో జనవరిలో నిర్మల్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభకనబర్చి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిచే ప్రశంసాపత్రం అందుకోవడంతోపాటు జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైంది.

తయారీ ఇలా..

పెల్టియర్ ప్లేట్, 120706 సీపీసీ కూలింగ్ ఫ్యాన్, ఫ్యాన్ గేజ్, గైడ్ కోల్డ్‌ప్లేట్, రేడియేటర్, థర్మాట్ ఇన్సులేషన్ రబ్బరు పట్టి, సిలికాన్ గ్రీజు కనెక్ట్ ఫ్లెక్సిబుల్ పైపు, పారదర్శక ప్లాస్టిక్ కవర్, 12 ఓల్ట్ 6ఏ బ్యాటరీ, ప్లాస్టిక్ ఎన్‌క్లోజర్

కంప్యూటర్లు లేదా ల్యాప్‌టాప్‌లలో ఉపయోగించే పెల్టియర్ మాడ్యూల్‌తో పెల్టియర్ బ్లాంకెట్‌ను రూపొందించింది. ఈ బ్లాంకెట్ పెల్టియర్ మాడ్యూల్ ద్వారా ఒకవైపు చల్లని గాలి, మరోవైపు వేడి గాలి గొట్టాల ద్వారా పంపిస్తూ ఒకే బ్లాంకెట్‌ను చలికాలం, వేసవికాలంలో అనుకూలంగా వినియోగించుకోవడానికి వీలుంటుంది. రూ.4-5 వేలలోపు ఖర్చుతో ఈ పెల్టియర్ బ్లాంకెట్‌ను తయారు చేసుకోవచ్చని విద్యార్థిని పేర్కొంది.

'కుండ' కూలర్


కుండ కూలర్ గురించి వివరిస్తున్న విద్యార్థి గణేష్

కందనూలు: జిల్లాలోని అచ్చంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి గణేష్ కుండకూలర్‌ను తయారు చేశారు. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్ (పర్యావరణ అనుకూల సామగ్రి)తో అతి తక్కువ ఖర్చుతో పర్యావరణహితంగా ఉండే కుండ కూలర్‌ను తయారు చేసి కేరళలో జరిగిన జాతీయ స్థాయి ప్రదర్శనలో ప్రశంసలు అందుకున్నారు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవంలోనూ ప్రదర్శించగా.. కలెక్టర్ ఉదయ్‌కుమార్ విద్యార్థిని అభినందించి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు.

వేరుశనగ పొట్టుతో కుండి

గద్వాల: మొక్కలు పెంచడానికి ఉపయోగపడే జీవశైధిల్య (బయో- డీగ్రాడేబుల్) ద్వారా తయారు చేసిన కవరును కేటీదొడ్డి మండలం చింతలకుంటకు చెందిన విద్యార్థిని శ్రీజ రూపొందించారు. స్వగ్రామంలో పదో తరగతి వరకు చదివిన శ్రీజ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. నర్సరీలలో ప్లాస్టిక్ బ్యాగులు, కవర్లలో మట్టి నింపి మొక్కలు పెంచుతున్నారు. ఆ మొక్కలు తీసిన తర్వాత కోట్ల సంఖ్యలో పారవేసిన ప్లాస్టిక్ ఉండిపోతుంది. ఇది పర్యావరణానికి హానికరం. దీనిని నివారించడానికి విద్యార్థి తన నైపుణ్యంతో అద్భుతమైన ఆవిష్కరణ చేపట్టింది. వేరుశనగ పొట్టును గుజ్జుగా చేసి వాటి ద్వారా మొక్కల కుండీలను తయారు చేసింది. ఈ గుజ్జులో సహజసిద్ధమైన నైట్రోజన్, ఫాస్పరస్ ఎక్కువ మోతాదులో ఉంటుంది. మొక్కతోపాటు కుండిని భూమిలో నాటడం వల్ల భూమిలో కలిసిపోవడమే కాకుండా ఎరువుగా ఉపయోగపడుతుందని వివరించింది. శ్రీజ రూపొందించిన ఆవిష్కరణకు రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది.

బయోపాట్ పరిశ్రమ..

శ్రీజ సృజనాత్మక ఆలోచన ఏకంగా పరిశ్రమ ఏర్పాటుకు బాటలు వేసింది. శ్రీజ రూపొందించిన పర్యావరణహిత కుండల (బయోపాట్) తయారీకి రాష్ట్రంలో సూక్ష్మ పరిశ్రమ ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. ప్రభుత్వ సంస్థ టీ-వర్క్స్, చైనా బహుళజాతి కంపెనీ హయర్‌కు చెందిన 'జీఈ అప్లయన్సెస్'లు గద్వాలలో సంయుక్తంగా ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.


బయోతొట్టి రూపకర్త విద్యార్థిని శ్రీజను అభినందిస్తున్న సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ (ఫైల్)

చార్జింగ్‌తో మోపెడ్.. బ్యాటరీతో సైకిల్


బ్యాటరీ అమర్చిన సైకిల్‌పై మణికంఠ

అమరచింత: పట్టణానికి చెందిన విద్యార్థి సాక మణికంఠ తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం ఎలా పొందాలనే ఆలోచనతో తమ ఇంట్లో ఉన్న సైకిల్, టీవీఎస్ మోపెడ్‌పై ప్రయోగం చేశాడు. తన తండ్రి రోజువారి టీవీఎస్ ప్రయాణం కోసం పెట్రోల్ ఖర్చులు అధికమవుతున్నాయని భావించి తన ఆలోచనకు పదును పెట్టాడు. తాను ఇంట్లో పనిచేసుకొంటూ దాచుకున్న డబ్బులతోపాటు తండ్రితో మరో రూ.10 వేలు తీసుకొని మొత్తం రూ.18 వేల ఖర్చుతో టీవీఎస్‌కు బ్యాటరీ అమర్చి పెట్రోల్ అవసరం లేకుండా నడిపించాడు. ముందుగా మణికంఠ యూట్యూబ్‌లో అన్వేషించి.. కావాల్సిన పరికరాలను హైదరాబాద్ నుంచి తీసుకువచ్చాడు. అక్కడ బ్యాటరీ, కంట్రోలర్, మోటర్, బ్రేక్, హారన్, చార్జర్, తాళం కొనుగోలు చేసి మోపెడ్‌కు అమర్చాడు. మూడు గంటలు చార్జింగ్‌తో 30 కి.మీ., ప్రయాణించగలిగే వాహనంను సిద్ధం చేసి ప్రశంసలు అందుకున్నాడు.


చార్జింగ్ బ్యాటరీ అమర్చిన మోపెడ్

సైకిల్‌కు చార్జింగ్ బ్యాటరీ..

సైకిల్‌ను తొక్కకుండానే బ్యాటరీ సహాయంతో 30 కి.మీ., నడిచేలా మరో ప్రయోగం చేశాడు. తన తండ్రికి ఉపయోగపడేలా రూ.10 వేలు ఖర్చు పెట్టి కొనుగోలు చేసిన సామగ్రి సైకిల్‌కు బిగించాడు. ప్రతిరోజు గంట చార్జింగ్ పెడితే 20 కి.మీ., ప్రయాణించేలా తీర్చిదిద్ది తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. మణికంఠ ప్రస్తుతం హైదరాబాద్‌లోని పుష్పగిరి ఐ ఆస్పత్రిలో ఆప్తమెట్రిస్ట్ చదువుతున్నాడు.

విద్యుత్ లేకుండా ఫ్యాన్..


ఫ్యాన్ ప్రదర్శనతో విద్యార్థి నికిలేశ్వర్ (ఫైల్)

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నికిలేశ్వర్ సత్తాచాటి జాతీయస్థాయి పోటీలో ప్రదర్శనలిచ్చారు. విద్యుత్ సరఫరాలో కలిగే అంతరాయాల వలన కొన్ని సందర్భాల్లో ఫ్యాన్ ఉపయోగించులేకపోతాం. కరెంటు బిల్లు ఎక్కువగా వస్తుందని కొంతమంది పేదలు ఫ్యాన్లను ఎక్కువగా వినియోగించరు. ఈ సమస్య పరిష్కారానికి విద్యార్థి నికిలేశ్వర్ తయారు చేసిన తన ఆవిష్కరణ ఆకట్టుకుంది. విద్యుత్ అవసరం లేని ఫ్యాన్‌ను రూపొందించారు. సైకిల్ రిమ్, పెడల్, ఫ్యాన్ రెక్కల సాయంతో ఫ్యాన్‌ను తయారు చేశాడు. ఉపాధ్యాయురాలు రాధిక గైడ్‌గా వ్యవహరించారు. చేనేత కుటుంబ నేపథ్యం కావడంతో ఇంట్లోని రాట్నం చూసి స్ఫూర్తి పొందానని విద్యార్థి పేర్కొన్నాడు. న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రదర్శించి మన్ననలు పొందారు.

స్కూల్ బస్సును ఢీకొన్న టిప్పర్

- విద్యార్థులు క్షేమం, తప్పిన ప్రమాదం

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ పాఠశాల బస్సును టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటన సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలానికి చెందిన ప్రైవేట్ పాఠశాల బస్సు సాయంత్రం విద్యార్థులను ఇంటి వద్ద దించడానికి అంబేడ్కర్ చౌరస్తా దాటుతుండగా నంబర్ ప్లేటు లేని ఒండ్రు మట్టి తరలిస్తున్న టిప్పర్ వేగంగా వచ్చి బస్సుకు సమీపంగా రాగానే బ్రేకులు వేయడంతో బస్సు వెనుక భాగాన్ని తాకడంతో ఒక్కసారిగా బస్సు కుదుపునకు గురైంది. బస్సులోని చిన్నారులు పెద్దగా అరుపులు వేయడంతో జనం గుమిగూడారు. స్థానికులు కాసేపు టిప్పర్ డ్రైవర్‌ను వారించి అక్కడి నుంచి పంపించివేశారు.

టిప్పర్ల వెనుక ప్రజాప్రతినిధి

మహదేవునిపేటలోని డంపింగ్‌యార్డు నుంచి ఒండ్రుమట్టిని తరలిస్తున్న టిప్పర్ వాహనాలు ఒక కంపెనీకి చెందినవే కానీ, ఆ కంపెనీ వెనకాల ప్రజాప్రతినిధి ఉండటంతో కనీసం ఫిర్యాదు చేయలేని దుస్థితి నెలకొందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంలో పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు చేస్తే భవిష్యత్‌లో ఏమైన ఇబ్బందులకు గురి చేయవచ్చనే భయంతో కనీసం ఫిర్యాదు చేయలేకపోయారు. ఆ ప్రజాప్రతినిధి అండదండలతో నడుస్తున్న కంపెనీ, టిప్పర్ వాహనాలు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా మీదుగా తిరుగుతుంటే ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్డుపైకి రావాల్సి వస్తుంది.


బిజినేపల్లి అంబేడ్కర్ చౌరస్తాలో నెంబర్ ప్లేట్లు లేని టిప్పర్లు

మృతదేహం వద్ద ఉన్న వ్యక్తి ఎవరు?

కోస్గి: పట్టణ శివారులోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న ఓ దాబా సమీపంలో పాలమూరు- తాండూరు ప్రధాన రహదారి పక్కన గుర్తుతెలియని మహిళ(46) అనుమానాస్పదంగా మృతిచెంది ఉండటాన్ని అటుగా వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గుర్తుతెలియని మహిళ మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో భద్రపరిచి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అదేరోజు ఓ వ్యక్తి మహిళ శవం పక్కన కూర్చొని ఉన్న ఫొటోలు సమీపంలోని కొందరు యువకులు తీసి వివరాలు సేకరించేందుకు ప్రయత్నించగా సదరు వ్యక్తి పారిపోయాడు. ప్రస్తుతం మహిళ మృతదేహం దగ్గర వ్యక్తి కూర్చొని ఉన్న ఫొటో స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా ఇప్పటికీ మహిళ వివరాలు లభించలేదని, దొరికిన ఫొటో ఆధారంగా వివరాలు సేకరిస్తామన్నారు. కాగా శవం పక్కన అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తి ఎవరు అనే చర్చ జోరుగా జరుగుతుంది.


మహిళ మృతదేహం పక్కన కూర్చున్న వ్యక్తి

లోన్ ఇస్తారని నమ్మి మోసపోయిన యువకుడు

ఊట్కూర్: బజాజ్ ఫైనాన్స్‌లో లోన్ ఇస్తారని నమ్మిన పోతురాజు ఆంజనేయులు రూ.88 వేలు మోసపోయిన సంఘటన మండలంలోని నిడుగుర్తిలో చోటుచేసుకుంది. ఈ విషయమై సోమవారం సైబర్ క్రైం నం 1930కు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాములు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిడుగుర్తికి చెందిన పోతురాజు ఆంజనేయులు ఫోన్‌కు బజాజ్ ఫైనాన్స్ ద్వారా లోన్ ఇస్తామని ఫిబ్రవరి 2న నార్మల్ మెసేజ్ వచ్చింది. లోన్ అవసరమైతే వాట్సాప్ నంబర్ పెట్టమని వారు వాట్సాప్ నంబర్ పెట్టారు. దీంతో యువకుడు తన వాట్సాప్ ద్వారా వారు అడిగిన పాన్‌కార్డు, ఆధార్‌కార్డు పెట్టాడు. లోన్ మంజూరైందని జీఎస్టీ, టీడీఎస్, ఆర్బీఐ చార్జీలకు ముందుగా డబ్బులు కట్టాలని వారు ఫోన్ ద్వారా చాటింగ్ చేశారు. అవతలి వ్యక్తి చాటింగ్‌లో మాటలను నమ్మిన యువకుడు సాయంత్ర వరకు దఫాల వారీగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ.88 వేలు వేశాడు. వారి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి చేసేది లేక బాధితుడు సైబర్ క్రైం నంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. సైబర్ బ్రాంచ్ నుంచి ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

టైలర్స్‌డే శుభాకాంక్షలు
టైలర్స్ డే శుభాకాంక్షలు
మా యొక్క ప్రత్యేకత అన్ని రకాల సూట్స్ కుట్టబడును
Sri M.D.BABU
NATIONAL MEN'S TAILORS
Beside II Town, Traffic Police Station, Municipal Complex, New Town, MAHABUBNAGAR, Cell: 9666383575

టైలర్స్ డే శుభాకాంక్షలు
మహబూబ్‌నగర్ పట్టణ ప్రజలకు, మిత్రులకు, కస్టమర్లకు టైలర్స్‌డే శుభాకాంక్షలు.
ABDUL KAREEM Cell:9948692221
Best Compliments..
JEANS ALTERATION
NOTE : All Jeans Pants, Shirts, T-Shirts, Zibs, Pencil Cuts Buttons etc
Beside Khabarasthan Wall, S.S.Gutta Road, M.Nagar.
BURANOUDDIN Cell:9703832484

బంగారం దుకాణంలో నగదు చోరీ

గద్వాల క్రైం: పట్టణంలోని బంగారం దుకాణంలో బంగారం విక్రయించేందుకు వచ్చిన వ్యక్తి నుంచి రూ.3.50 లక్షల నగదును అపహరించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నల్లకుంట కాలనీకి చెందిన కృష్ణయ్య తన కుటుంబ అవసరాల నిమిత్తం 7 తులాల బంగారాన్ని పట్టణంలోని ఈశ్వరయ్య బంగారం దుకాణంలో విక్రయించాడు. విక్రయించిన క్రమంలో రూ.3.50 లక్షలను సదరు దుకాణ యాజమాని కృష్ణయ్యకు అందజేశాడు. విక్రయించిన క్రమంలో యాజమానితో మాట్లాడుతున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బాధితుడి బ్యాగు నుంచి నగదను అపహరించారు. బయటకు వెళ్లామనే క్రమంలో బ్యాగు బరువు లేకపోవడంతో బ్యాగును చెక్ చేశాడు. దీంతో నగదు చోరీకి గురైనట్లు గుర్తించి సీసీ కెమెరాల్లో పరిశీలించగా.. ఓ గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించి పట్టణ పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలియజేశారు.

రాంపూర్‌పెంటలో గుడిసె దగ్ధం



మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం నల్లమల ఆటవీ లోతట్టు ప్రాంతంలోని రాంపూర్ చెంచుపెంటలో ఆదివారం అర్ధరాత్రి గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాంపూర్ పెంటకు చెందిన చిగుర్ల పెద్ద బయ్యన్నకు చెందిన గుడిసె రాత్రి సుమారు 1:30 గంటల సమయంలో అకస్మాతుగా గుడిసెకు మంటలు ఎగిసిపడినట్లు తెలిపారు. దీంతో ఇంట్లోని సోలార్ లైట్, బ్యాటరీ, బీరువా, వంట సామగ్రి, దుస్తులు, నిత్యావసరాలు పూర్తిగా కాలి బూడిదైనట్లు తెలిపారు. బాధితులు కట్టుబట్టలతో బయటపడి ప్రాణాలు దక్కించుకున్నట్లు తెలిపారు. దీంతో సుమారు రూ1.80 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు.

కాల్చారా.. కాలిపోయిందా?

- గద్వాల డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లో షార్ట్‌సర్క్యూట్?
- దగ్ధమైన ఫైల్స్.. మంటల ధాటికి కూలిన పైకప్పు
- గుర్తుతెలియని వ్యక్తులు తాళం ధ్వంసం చేసినట్లు ఆనవాళ్లు


డీపీఓ కార్యాలయంలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


మంటల నుంచి పలు ఫైల్స్ బయటకు తీసుకువచ్చిన ఫైర్ సిబ్బంది

గద్వాల క్రైం: జోగుళాంబ గద్వాల జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ కార్యాలయాల్లో షార్ట్‌సర్క్యూట్ సంభవించి పలు ఫైల్స్, కంప్యూటర్లు, ప్రింటర్స్, ప్రొజెక్టర్, టేబుళ్లు దగ్ధమయ్యాయి. మంటల ధాటికి డీఎల్‌పీఓ కార్యాలయ పైకప్పు కూలిపోయింది. అయితే ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా.. లేదా ఎవరైనా కావాలనే చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ కార్యాలయలు జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ క్వాటర్స్‌లో ఉన్నాయి. సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కార్యాలయంలో మంటలు వ్యాపించినట్లు ముందుగా కార్యాలయ అటెండర్ గుర్తించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.3 లక్షల విలువ గల కంప్యూటర్లు, ప్రింటర్లు, సామగ్రి కాలిపోయినట్లు డీపీఓ శ్యాంసుందర్ తెలిపారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫైళ్లు అపహరించేందుకేనా?

గుర్తు తెలియని వ్యక్తులు కార్యాలయ తాళం పగులగొట్టి ముఖ్యమైన ఫైల్స్ అపహరించి, షార్ట్‌సర్క్యూట్ చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల నూతన పంచాయతీ కార్యదర్శుల నియామకంలో సిబ్బంది నకిలీ ధ్రువపత్రాలు, జాతీయ ఉపాధిహామీ పథకంలో పెద్దఎత్తున అవినీతికి సంబంధించిన ఫైల్స్, పంచాయతీ పరిధిలోని లేఅవుట్లు ముఖ్యమైన ఫైల్స్ ఉన్నతాధికారులకు చేరకుండా షార్ట్‌సర్క్యూట్ పథకం రచించినట్లు తెలుస్తుంది. దీనికి తోడు పింఛన్ లబ్ధిదారుల ఎంపికలోనూ పారదర్శకత లోపించినట్లు సమాచారం. ఈ ఫైల్స్ సైతం మంటల్లో కాలిపోవడం అనుమానాలకు తావిస్తోంది. గతంలో ఇక్కడ పలువురు అధికారులకు నివాస గృహాలుగా కేటాయించారు. జిల్లా ఏర్పాటు తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు అనువుగా ఉండడంతో మార్చారు.

తాళం ధ్వంసం..

ప్రభుత్వ కార్యాలయంలో మంటలు వ్యాపించి ఫైల్స్ దగ్ధమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక విచారణ చేపట్టారు. కార్యాలయం తాళం పగులగొట్టి ఉండటంతో దానిపై వేలిముద్రలు సేకరించారు. విలువైన ఫైల్స్ కాజేసే క్రమంలో షార్ట్‌సర్క్యూట్‌గా చిత్రీకరించారా.. ప్రమాదవశాత్తు జరిగితే కార్యాలయ తాళం ఎందుకు పగులగొట్టారని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

గతంలో తహసీల్దార్ కార్యాలయం

జిల్లాలోని ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అగ్నిప్రమాదాలు జరుగుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2020 అక్టోబర్ 25న మానవపాడు తహసీల్దార్ కార్యాలయంలోనూ షార్ట్‌సర్క్యూట్ జరిగి.. భూముల రికార్డులు, ఫైల్స్ దగ్ధమయ్యాయి. విలువైన ప్రభుత్వ భూములు కబ్జాదారుల చేతిలో ఉండడం వల్లే ప్రమాదాన్ని సృష్టించినట్లుగా ఆరోపణలు వచ్చాయి. కానీ, ఇప్పటి వరకు ఆ కేసులో పురోగతి లేదు. తాజాగా డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయంలో జరిగిన సంఘటనపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై కలెక్టర్ వల్లూరి క్రాంతి, సంబంధిత సిబ్బందితో మాట్లాడారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSIONS FOR GUIDENCE
Admissions for Guidence B.Tech/M.Tech/ M.B.A, LLB / B.Sc, M.Sc Agri, P.G (All), Ph.d Few Seats Available. Cont: 9391471754, 8985533447, Hyd.

SERVICES
వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237

WANTED
జడ్చర్ల నందు పని చేయుటకు స్టోర్ మేనేజర్, టిఫిన్ మాస్టర్ మరియు హెల్పర్ కావలెను మంచి జీతం ఇవ్వబడును సంప్ర: 7416317339.

సాక్షి భవిత విద్యార్థుల కోసం

HAPPY BIRTHDAY
సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/-

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ఎవరి... సాక్షి మేనేజర్

క్లుప్తంగా...

రేపు లాసెట్ నోటిఫికేషన్ విడుదల

- 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని యూనివర్సిటీలు, న్యాయ కళాశాలల్లో న్యాయ విద్యలో మూడేళ్లు, ఐదేళ్ల కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి టీఎస్ లాసెట్–2023, టీఎస్‌పీజీఎల్‌సెట్–2023 షెడ్యూల్ విడుదలైంది. మార్చి 1న నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్.లింబాద్రి విడుదల చేస్తారు. మార్చి 2వ తేదీ నుంచి సెట్ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు స్వీకరణ గడువు ఏప్రిల్ 6. రూ.500 అపరాధ రుసుముతో ఏప్రిల్ 12 వరకు, రూ.1000 అపరాధరుసుముతో ఏప్రిల్ 19, రూ.2వేల అపరాధ రుసుముతో ఏప్రిల్ 26 వరకు, రూ.4వేల అపరాధ రుసుముతో మే 3వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు సెట్ కన్వీనర్ బి.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ లాసెట్–23, టీఎస్‌పీజీఎల్‌సెట్–23 పరీక్షలను మే 25వ తేదీన నిర్వహించనున్నారు. మే 29వ తేదీన ప్రిలిమినరీ కీ విడుదల చేస్తారు. అభ్యంతరాల స్వీకరణకు గడువు మే 31గా నిర్ణయించారు. తుది కీ, ఫలితాల ప్రకటన తేదీలను ఆ తర్వాత ప్రకటించనున్నారు.

నేడు టీఎస్ఐసెట్ నోటిఫికేషన్ విడుదల

కేయూ క్యాంపస్: తెలంగాణలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సు ల్లో ఈ విద్యా సంవత్సరం (2023–2024) ప్రవేశాలకుగాను టీఎస్ఐసెట్–2023 నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, టీఎస్ఐసెట్ చైర్మన్, కేయూ వీసీ తాటికొండ రమేశ్ విడుదల చేస్తారని టీఎస్ఐసెట్ కన్వీనర్, కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వరలక్ష్మి సోమవారం తెలిపారు.

సిసోడియాకు ఒక న్యాయం.. అదానీకి ఒక న్యాయమా?

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను అరెస్టు చేశారు కానీ, ఆర్థిక కుంభకోణాల్లో అతిపెద్ద కుంభకోణానికి పాల్పడిన అదానీని అరెస్టు చేయరా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. నిజాయితీగా అత్యధిక మెజారిటీతో 90 శాతానికి పైగా సీట్లతో అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీని కూడా బతకనివ్వరా? అని ఆయన నిలదీశారు.

గుడిసె గోడు.. ఆలకించాలి దొర!




ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ఏళ్లుగా పోరాటాలు చేస్తున్న ఆదివాసీలు తమ దైవమైన హీరా సుఖ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల మండలం బట్టిసావర్గాం శివారు సర్వే నం.72 వద్ద 20 ఎకరాల్లో సుమారు వెయ్యిమంది గుడిసెలు వేశారు. ఈ స్థలంపై తమకు హక్కులు కల్పించాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న మావల ఆర్ఐ హన్మంత్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని గుడిసెలు తొలగించేందుకు ప్రయత్నించగా..వారు వినకపోవడంతో ఆర్ఐ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రాష్ట్రాభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- తెలంగాణ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్రపై వరంగల్ వేదికగా చర్చిద్దాం
- కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి సవాల్
- కేసీఆర్ రాక్షస పాలనకు అంతం ఖాయం
- 4కోట్ల మంది నుంచి కల్వకుంట్ల కుటుంబం బహిష్కరణ
- జోడో యాత్రలో టీపీసీసీ చీఫ్



బహిరంగసభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న రేవంత్‌రెడ్డి

పరకాల: తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర లేదంటున్న కేటీఆర్.. కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమిటో తేల్చుకోవడానికి వరంగల్ ఏకశిల పార్క్ వద్ద చర్చకు సిద్ధమా అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రేవంత్ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర సోమవారం పరకాల పట్టణానికి చేరుకుంది. బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. '4 కోట్ల తెలంగాణ ప్రజలందరూ నా కుటుంబం అని చెప్పుకునే కేటీఆర్ ప్రగతి భవన్‌కు ప్రజలను ఎందుకు రానివ్వడం లేదు. ఒక్క కుటుంబాన్ని అయినా పిలిచి భోజనం పెట్టలేదు. అలాంటి కల్వకుంట్ల కుటుంబాన్ని 4కోట్ల ప్రజలనుంచి బహిష్కరిస్తున్నాం. దీనిని పోరుగడ్డ అయిన పరకాల నుంచి ప్రకటిస్తున్నా'అని అన్నారు. ఓటు అనే ఆయుధంతో కేసీఆర్ రాక్షసపాలను అంతమొందించాలన్నారు. రాక్షసుడి బలంలో చిలుకలో ఉన్నట్లు.. కేసీఆర్ బలం ఎమ్మెల్యేలలో ఉందని వారందరినీ..చిలుక మెడలు విరిచినట్లు..వచ్చే ఎన్నికల్లో వీరిని చిత్తుగా ఓడిస్తే కేసీఆర్ అనే రాక్షసుడు బలహీనుడు అవుతాడన్నారు. వేధింపులతో గిరిజన డాక్టర్ బిడ్డ ప్రీతి ప్రాణాలను పొట్టనపెట్టుకున్నా, 4ఏళ్ల చిన్నారిని కుక్కలు దాడి చేసి చంపినా కూడా చలించని, పలకరించని కల్వకుంట్ల కుటుంబాన్ని క్షమించకూడదన్నారు. 'నీ ఇంట్లో ఆడబిడ్డను ఎవరైనా చంపితే ఇలాగే చేస్తావా'అని కేసీఆర్‌నుద్దేశించి ప్రశ్నించారు.

వైఎస్ హయాంలో సంక్షేమం

రాష్ట్రంలో వైఎస్సార్ హయంలో పేదలకు ఆరోగ్య శ్రీ, రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇల్లుల నిర్మాణం, ఉచిత విద్యుత్ అమలు చేసి ఆదుకున్నారని రేవంత్ గుర్తు చేశారు. మంత్రి దయాకర్ దందుపాళ్యం ముఠా దోపిడీలకు పాల్పడుతోందనీ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిలో పేరులోనే ధర్మం తప్ప అంత దందాలే చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అంజయ్యకుమార్ యాదవ్, పరకాల నియోజవర్గ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు రేవంత్‌రెడ్డి నాయకులతో కలిసి మెడికో ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.



'ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాది'

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాల రూపకల్పన, అమలు, ఫలితాల సాధనకు ఉత్తమ ప్రణాళికలే ప్రగతికి పునాదులు వేస్తాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యకమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రణాళిక, అర్థగణాంక శాఖ ఉన్నతాధికారులు, సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్(సీఈజీఐఎస్) కాకతీయ గవర్నెన్స్ ఫెలో(కేజీఎఫ్)లతో వినోద్‌కుమార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ప్రణాళిక శాఖ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని ఈ సందర్భంగా ఆయన వివరించారు. రాష్ట్రంలో కీలకమైన ప్రణాళిక, అర్థగణాంక , సీజీఎస్, కేజీఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

పోలీస్ వాహనాన్ని ఆపి | భైరి నరేశ్‌పై దాడి

- బీజేపీకి, హిందూత్వకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించేది లేదని బెదిరింపు
- హన్మకొండ పీఎస్‌లో ఎస్సై రవికిరణ్ ఫిర్యాదు



పోలీస్ వాహనంలోకి చొరబడి దాడి చేస్తున్న వ్యక్తులు

వరంగల్ క్రైం: భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు భైరి నరేశ్‌పై హన్మకొండలో మూకుమ్మడి దాడి జరిగింది. హన్మకొండ ఆదర్శ కళాశాలలో లా చదువుతోన్న భైరి నరేశ్ సోమవారం జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అతనిపై దాడి జరగనుందని పోలీసులకు అందిన సమాచారంతో వాహనంలో తరలిస్తుండగా కొందరు ద్విచక్ర వాహనాలను అడ్డుపెట్టి ఆపారు. హిందూత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడితే క్షమించేది లేదంటూ నినాదాలు చేస్తూ పోలీస్ వాహనం లోపలికి చొరబడి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో భైరి నరేశ్‌తోపాటు సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అచ్యుత్ రాజ్ ఉన్నారు. దాడి అనంతరం పోలీసులు భైరి నరేశ్‌ను హన్మకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీస్ వాహనాన్ని అడ్డగించి దాడి చేయడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. దాడికి పాల్పడిన వారిని వీడియోల ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు వేట ప్రారంభించారు.

దాడి సమాచారం తెలిసే పోలీసులను ఆశ్రయించాను

ఆదర్శ లా కళాశాలలోని అంబేడ్కర్ భవన్‌లో ఎదురుగా ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, ఏబీవీపీ కార్యకర్తలు నాపై దాడి చేయడానికి ఉన్నారని తెలిసి పోలీసులకు సమాచారం ఇచ్చాను. పోలీసు వాహనంలో బయల్దేరిన నన్ను బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వెంబడించి అడ్డుకుని దాడి చేశారు. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛ అందరికీ ఉంది. నాపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసం.

–భైరి నరేశ్,
భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు

నిందితులపై కేసు నమోదు చేస్తున్నాం..

సుబేదారి ఎస్సై రవికిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసు వాహనాన్ని అడ్డగించి వాహనంపై దాడి చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి, అందులో ఉన్న భైరి నరేశ్‌పై దాడి చేసిన నిందితుల మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. చట్టపరంగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తాం.

– శ్రీనివాస్‌జీ,
హన్మకొండ ఇన్‌స్పెక్టర్

మై బిగ్గెస్ట్ చీర్ లీడర్

- మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- సమానత్వం పై ప్రచారం
- అడిషనల్ డీజీ శిఖాగోయల్

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళా భద్రత విభాగం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'మై బిగ్గెస్ట్ చీర్‌లీడర్'పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా తమ జీవితాల్లో సమానత్వం నింపి, ప్రోత్సహించిన వ్యక్తుల గురించి పరిచయం చేయాలని భద్రత విభాగం ఇంచార్జి, అడిషనల్ డీజీ శిఖాగోయల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఓ ట్వీట్ పెట్టారు. మై బిగ్గెస్ట్ చీర్ లీడర్ పేరిట నిర్వహిస్తున్న ఈ ఆన్‌లైన్ ప్రచారంలో భాగస్వాములు కావాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ మహిళా భద్రత విభాగం ట్విట్టర్ ఖాతాలో వీడియో లేదా ఫొటోను జత చేయాలని కోరారు. అదేవిధంగా మరో ముగ్గురిని ట్యాగ్ చేయాలని సూచించారు. ఇలా వచ్చే వీడియోల నుంచి ఉత్తమమైనవి ఎంపిక చేసి, వాళ్లను సన్మానించనున్నట్టు తెలిపారు.

మా నాన్నే నా చీర్‌లీడర్..

అడిషనల్ డీజీ షికా గోయల్ బిగ్గెస్ట్ చీర్ లీడర్ వీడియోలో మాట్లాడుతూ 'నా బిగ్గెస్ట్ చీర్ లీడర్ మా నాన్నే. నాపై నాకంటే మా నాన్నకే ఎక్కువ నమ్మకం ఉండేది. అత్యంత కఠినమైన ఈ పోలీస్‌జాబ్‌లో చేరడంలోనూ ఆయనే కీలకం. సివిల్స్ రిజల్ట్ వచ్చిన రోజు నాకు ఇంకా గుర్తుంది. ''ఏం సందేహపడకు..నువ్వు కచ్చితంగా ఈ వృత్తిలో రాణిస్తావు''. అని ప్రోత్సహించారు. ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉండేలా చేసినందుకు నాన్నా నీకు కృతజ్ఞతలు. ఇంట్లో మా అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లను సమానంగా చూసినందుకు కూడా మీకు కృతజ్ఞతలు చెబుతున్నా..నా మాదిరిగానే మీ జీవితంలోనూ ఒక బిగ్గెస్ట్ చీర్ లీడర్ ఉండే ఉంటారు. వారి గురించి మాకు చెప్పండి'అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

చక్రాపూర్ గుట్టల్లో అగ్నిప్రమాదం



చక్రాపూర్ గుట్టల్లో ఎగిసిపడుతున్న మంట

అడ్డాకుల: మూసాపేట మండలంలోని చక్రాపూర్ మర్రికుంట వద్ద అడ్డగుట్టల్లో అగ్నిప్రమాదం సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం వారం రోజుల నుంచి రాత్రివేళ మంటలు ఎగిసిపడుతున్నాయి. సాధారణంగా వచ్చే మంటలే ఉండవచ్చని అందరూ భావించారు. రెండు రోజుల నుంచి రాత్రివేళ చెట్లు అంటుకొని అగ్ని ఎగిసిపడటంతో ఆందోళన చెందుతున్నారు. జాతీయ రహదారి పక్కన గాజులపేట స్టేజీ, కనకాపూర్, చక్రాపూర్ మీదుగా మన్యంకొండ దేవాలయం వరకు గుట్టలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం చక్రాపూర్ శివారు నుంచి కోడూర్ గండి వైపు మంటలు ఎగిసిపడుతున్నాయి. మరో వైపు లక్ష్మింపల్లి వైపు కూడా మంటలు చెలరేగాయి. సూర్యరశ్మి కారణంగా పగలు అగ్ని కనిపించడం లేదని రాత్రివేళ మాత్రం మంటలు కనిపిస్తున్నాయి. ఈ విషయమై సర్పంచ్ శైలజారెడ్డి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అటవీశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు


మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తి నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 110 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 90 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

- నేటి నుంచి ప్రారంభం
- 7న రథోత్సవం



ఆలయంలో భూదేవి సమేతుడై కొలువుదీరిన రంగనాయక స్వామి



శ్రీరంగాపూర్ గ్రామంలోని రంగనాయకస్వామి ఆలయం

పెబ్బేరు రూరల్: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న రంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. ఏటా ఫాల్గుణ శుద్ధపూర్ణిమ నుంచి ఉగాది పండుగ వరకు సుమారు 15రోజుల పాటు ఈనెల 28 నుంచి 9వరకు జాతర జరుగుతుంది. రథోత్సవానికి వచ్చే భక్తులకు శ్రీరంగాపురం గ్రామ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం, తాగునీటి వసతి కల్పిస్తున్నారు. ఇతర ఆలయాల్లో రాత్రివేళల్లో రథోత్సవం నిర్వహిస్తారు. ఇక్కడ మాత్రం ఉదయం నిర్వహించడం విశేషం.

ఉట్టిపడే శిల్పసంపద

రంగనాథస్వామి ఆలయంలో అద్భుతమైన శిల్పసంపద భక్తులను కట్టిపడేస్తుంది. వివిధ శిల్ప సంప్రదాయాలతో, ద్వార పాలకా శిల్పాలతో ఆకాశాన్నంటే అంతస్తులతో భక్తులకు ఆలయం స్వాగతం పలుకుతోంది. శేషశయనుడై అభయహస్తం చూపుతూ స్వామి వారు, ఆయనకు ఎడమవైపున చతుర్భుజ తాయారు ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. ఆలయం ప్రక్కనే ఆనాటి ప్రభువులు నిర్మించిన శ్రీరంగసముద్రం అనే సువిశాల మైన చెరువు చూపరులను ఆకట్టుకొంటుంది. ఆలయంలో ఇప్పటికే అనేక సినిమాలు, టీవీ సీరియల్స్ కోసం షూటింగ్ నిర్వహించారు. ఈ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిర్మాణాలు జరుగుతున్నాయి.

భక్తులకు ఇబ్బందిలేకుండా చూస్తాం..

బ్రహోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. అవసరమైన ఏర్పాట్లు చేశాం. తాగునీరు, పారిశుద్ధ్యానికి, ప్రాధాన్యం ఇస్తున్నాం. – శేఖర్‌గౌడ్, ఆలయ ఈఓ

ఆలయ చరిత్ర

మండల పరిధిలోని కొర్విపాడు (నేటి శ్రీరంగాపురం) గ్రామంలో సుమారు 340 సంవత్సరాల క్రితం సూగూరు (వనపర్తి) సంస్థాన ప్రభువు అష్టభాషా బహిరీ గోపాలరావు(క్రీ.శ.1670) కాలంలో ఈ ఆలయం నిర్మాణం జరిగింది. గ్రామంలో రంగసముద్రం పేరు గల చెరువు ఒడ్డున గరుడాద్రి మీద నిర్మించిన శ్రీరంగనాయక స్వామి ఆలయం అపర శ్రీరంగంగా పేరొందింది. శ్రీరంగనాథస్వామి ఆలయం నిర్మాణంతో కొర్విపాడుగా పిలుచుకునే గ్రామం శ్రీరంగాపురంగా వాడుకలోకి వచ్చింది. తమిళనాడు రాష్ట్రంలో ప్రసిద్ధ వైష్ణవ పుణ్య క్షేత్రంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీరంగంకు సమానంగా వనపర్తి జిల్లా , శ్రీ రంగాపురం గ్రామంలోని శ్రీరంగనాథస్వామి ఆలయం ప్రసిద్ధికెక్కింది. శ్రీరంగం వెళ్లి స్వామి వారిని దర్శించే శక్తిలేని భక్తులు శ్రీరంగాపురం లోని ఆలయాన్ని దర్శించి తరించవచ్చని భక్తుల నమ్మకం.



శిల్పసౌందర్యంతో నిర్మించిన గాలి గోపురం

కార్యక్రమాలు ప్రారంభం ఇలా..

మంగళవారం ఉదయం ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. కొయిలాళ్వార్ తిరుమంజనం, రాత్రి విష్వక్సేనపూజ, పుణ్యాహవాన, అంకురార్పణ.

- 1న బుధవారం ఉదయం ధ్వజరోహణ, రాత్రి ఉత్సవాలు భేరి పూజ.
- 2న, గురువారం ఉదయం మూలమంత్ర హవనము, రాత్రి ఉత్సవములు సూర్యప్రభ, తిరువిధి ఉత్సవం.
- 3న శుక్రవారం ఉదయం మూలమంత్రహోమం, రాత్రి శేషవాహన తిరువీధి ఉత్సవం.
- 4న శనివారం ఉదయం మూలమంత్ర హోమం, రాత్రి హనుమంత వాహన సేవ మంటపోత్సవం.
- 5న ఆదివారం చతుస్థానార్చన, సాయత్రం 6 గంటలకు మోహినీ సేవ, రాత్రి 8 గంటలకు గరుడ సేవ, శ్రీవారి కల్యాణం.
- 6న సోమవారం ఉదయం తిరువీధి సేవ, రాత్రి రథాంగహోమం,గజవాహన సేవ.
- 7న మంగళవారం ఉదయం 10 గంటలకు గంటలకు రథోత్సవం.
- 8న బుధవారం ఉదయం ఉత్సవములు శ్రీవారి మూలమంత్ర హోమం , రాత్రి ఉత్సవములు పారువేట,అశ్వవాహన సేవ.
- 9న గురువారం ఉదయం పూర్ణాహుతి, అవబృతం, తీర్థప్రసాద వితరణ, రాత్రి ధ్వజ అవరోహణ, నాగవల్లి ఉత్సవాలు జరుగుతాయి.

దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలి: ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీకి శేషవస్త్రాలను అందజేస్తున్న పాలకమండలి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను సోమవారం ఎమ్మెల్సీ సురభివాణి దర్శించుకున్నారు. ఏకవార రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అర్చకులు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. వీరితో పాటు ఆలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రవిప్రకాష్‌గౌడ్ ఉన్నారు.

❒ రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠంగాను, నవబ్రహ్మ ఆలయాలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ అన్నారు. దేవస్థానం పాలకమండలి పదవీ కాలం కేవలం ఏడాది మాత్రమే పెట్టడంతో ఆలయాలపై అక్కడి స్థితిగతులపై అవగాహన పెంచుకోవాడానికే సమయం సరిపోతుందన్నారు. దీంతో పాలక మండలి ఆలయాలను అభివృద్ధి చేసే ఆలోచనలు ఉన్నా వారికి సమయాభావం సరిపోవడం లేదని పాలకమండలి ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయానికి సంబంధించిన పలు సమస్యలపై దేవస్థానం పాలకమండలి వినతిపత్రం అందజేశారు.

ఆలయంలో రథోత్సవం

పరమేశ్వరుడికి ప్రీతికరమైన మాసం కావడంతో సోమవారం సాయంత్రం బాలబ్రహ్మేశ్వరుడికి రథోత్సవం నిర్వహించారు. ప్రతి సోమవారం స్వామివారి ఉత్సవ వరులను రథోత్సవంలో కూర్చుబెట్టి ఆలయం చుట్టూ ముమ్మారు సార్లు ఊరేగిస్తారని అర్చకులు తెలిపారు.

నేటి నుంచి వట్టెం వెంకన్న పుష్కర బ్రహ్మోత్సవాలు



వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయం

బిజినేపల్లి: ఉమ్మడి జిల్లాలోనే పేరొందిన వట్టెం వేంకటేశ్వరస్వామి వారి తృతీయ పుష్కర బ్రహ్మోత్సవాలు 28 నుంచి మార్చి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు అలంకారం, అర్చనలు, అంకురార్పణం, రెండవ రోజు పూర్ణాహుతి, మూల మంత్రహోమం నిర్వహించనున్నారు. మార్చి 2వ తేదీన జీయర్ స్వామి హాజరు కానుండటంతో సుదర్శన ఇష్టి, మార్చి 3న లక్ష్మీ నారాయణ పూజలు, పుష్కర సంచిక ఆవిష్కరణ, సన్మానాలు, 4న శ్రీవారికి ఏకోత్తర సహస్ర కలశాభిషేకం, 5వ తేదీన అంకురార్పణం, కౌతుక ధారణ, ధ్వజాదివాసం నిర్వహించనున్నారు. 6న సంతానం కోసం పుత్ర కామేష్టి, 8న కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు అనంత నర్సింహారెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజాప్రతినిధులపై గ్రామస్తుల ఫిర్యాదు



సీఐ సీతయ్యకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మరికల్: ఇథనాల్ కంపెనీ రద్దుకు పోరాడుతున్న గ్రామస్తుల ఇళ్ల వద్దకు వచ్చి అసభ్యకరంగా మాట్లాడిన ప్రజాప్రతినిధులు, వారి అనుచరులపై మండలంలోని చిత్తనూర్ గ్రామస్తులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో మరికల్ పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. అనంతరం ఇన్‌చార్జ్ సీఐ సీతయ్యకు మహిళలు ఫిర్యాదు పత్రాన్ని అందించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన..

తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళలు ఆందోళన చేశారు. కేఎన్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలపై సభ్య సమాజం తలదించుకునేలా అసభ్యకరంగా మాట్లాడిన వారు ఎంతటి వారైనా సరే అరెస్ట్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తమకు న్యాయం జరిగే వరకు నిత్యం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహారదీక్ష చేపడతామన్నారు. అనంతరం తహసీల్దార్ రాంకోటికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేష్, ఏఎస్ఐఎఫ్ నాగరాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్ బోధనలు చాలా మేలు



విద్యార్థులకు బహుమతి అందిస్తున్న శాస్త్రవేత్త భానుప్రకాష్‌రెడ్డి

నవాబుపేట: విద్యార్థులకు ప్రాక్టికల్‌గా బోధనలు చాలా చేస్తామని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త భానుప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యన్మన్‌గండ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆయన కేజీబీవీతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన, బోధనేతర పరిశోధనలలో మరింత స్వేచ్ఛను అందించి వారికి దిక్సూచీగా నిలవాలన్నారు. కాగా యన్మన్‌గండ్లలో ఉపాధ్యాయులు విద్యార్థులకు వివిధ రకాల ప్రయోగాలు నేర్పించి వారికి గుర్తింపు తీసుకుని రావటం చాలా గొప్పవిషయం అన్నారు. సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దశరత్‌నాయక్, శ్రీధర్ పాల్గొన్నారు.